రంజాన్ వేళలు
ఇఫ్తార్ (గురు) సా.6.23
సహరీ (శుక్ర) ఉ.4.45

ఎండా కాలమ్
	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	32	26

తడిసి మోపెడు!


అయినవిల్లి మండలం ఎస్.మూలపాలెంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంకుకు ఉన్న వైసీపీ రంగులు కనిపించకుండా క్లాత్‌తో కప్పిన దృశ్యం


» 'వైసీపీ రంగుల'కు వైట్ వాష్ వేయడం పంచాయతీలకు భారం
» ఎన్నికల నియమావళితో కొన్నిచోట్ల బరకాలు, క్లాత్‌లతో మూసేస్తున్న వైనం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన వివిధ భవనాలకు వేసిన రంగులను చెరపడానికి అధికారులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. కోనసీమ జిల్లావ్యాప్తంగా వందల సంఖ్యలో ప్రభుత్వ భవనాలకు రంగులు చెరపడానికి ఎన్నికల కమిషన్‌కు ఖర్చు తడిసి మోపెడవుతోంది. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, పంచాయతీ భవనాలు, వాటరు ట్యాంకులు, పాఠశాలల్లో నిర్మించిన మంచినీటి ట్యాంకులు తదితర నిర్మాణాలకు రంగులు చెరపడం భారీ వ్యయంతో కూడుకున్నది కావడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం రంగులు వేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే జిల్లావ్యాప్తంగా కోట్లాది రూపాయల ఖర్చుతో వాటిని చెరపాల్సిన పరిస్థితి పంచాయతీలు, మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్‌లకు పెనుభారంగా మారింది. కోనసీమ జిల్లాలోని ప్రభుత్వ భవనాలకు రంగులు చెరిపే పనిలో ఎన్నికల అధికారులు నిమగ్నమయ్యారు. కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉల్లంఘించినట్టు భావించి ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానికులు కూడా ఎక్కడికక్కడే ఫిర్యాదులు చేస్తుండడంతో ఎన్నికల నియమావళిని అనుసరించి ఈ భవనాలకు ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి గతంలో వేసిన రంగులపై వైట్ వాష్ వేస్తున్నారు. ఉదాహరణకు అమలాపురం రూరల్ మండలం రోళ్లపాలెం రైతు భరోసా కేంద్ర భవనానికి వేసి ఉన్న వైసీపీ రంగులపైనే వైట్ వాష్ వేస్తున్నారు. కామనగరువులో వాటర్ ట్యాంకుకు వేసిన వైసీపీ రంగులపై వైట్ వాష్ వేసే పనిలో కార్మికులు నిమగ్నమయ్యారు. అయినవిల్లి మండలం ఎస్.మూలపాలెంలో ఆర్‌డబ్ల్యుఎస్ వాటరు ట్యాంకుకు వైసీపీ రంగులు వేసి వాటిని చెరిపే ఆర్థిక స్తోమత లేక బరకాలు,క్లాత్‌లతో కప్పేశారు. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఎక్కడ చూసినా ఈ తరహా దృశ్యాలే కనిపిస్తున్నాయి. ఒకవేళ వైసీపీ రంగులనే ఉంచుతుంటే ప్రత్యర్థి పార్టీ వారు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయడం... వాటిపై సదరు అధికారులు వివరణ కోరుతుండడంతో ఎక్కడికక్కడే వాటిని చెరిపే పనిలో సిబ్బంది ఉన్నారు.


రోళ్లపాలెంలో ఆర్బీకేకు వేసిన వైట్ వాష్


అమలాపురం రూరల్ కామనగరువులో వైసీపీ రంగులతో ఉన్న ఓహెచ్‌ఎస్ఆర్‌కు వైట్ వాష్ వేస్తున్న సిబ్బంది


నంగవరం అంగన్వాడీ కేంద్రంలో వైఎస్సార్ ముద్రతో ఉన్న గుడ్డు

అంగన్వాడీ కేంద్రాల్లో ఇంకా ఆ గుడ్లే!

ఉప్పలగుప్తం, మార్చి 20: ఎన్నికల కోడ్ అమలులో అన్ని శాఖల అధికారుల తీరు ఒక్కటే. ఎవరో చెబితేనే గానీ కోడ్‌ను పట్టించుకోరు. గడువు ముగిసినా పాత బాణీయే. అంగన్వాడీ కేంద్రాల్లో కోడిగుడ్లు ఇంకా వైసీపీ ముద్రలు వీడలేదు. నంగవరం అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పిల్లలకు ఇచ్చిన గుడ్లపై వైఎస్సార్ ముద్రలే ఉండడం గమనార్హం.

ముగ్గురు వలంటీర్లపై వేటు



ఐ.పోలవరం, మార్చి 20: వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ముగ్గురు వలంటీర్లపై ఎన్నికల కమిషన్ వేటువేసింది. ఐ.పోలవరం మండలం కేశనకుర్రు, మురమళ్ల సచివాలయాల్లో పనిచేస్తున్న ముగ్గురు వలంటీర్లను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలిచ్చినట్టు ఎంపీడీవో అమీర్‌జమీ తెలిపారు. మురమళ్ల-1లో పనిచేస్తున్న కోటిపల్లి ప్రసాద్, మురమళ్ల-2లో పనిచేస్తున్న రెడ్డి లీలావెంకటేష్, కేశనకుర్రు-3 సచివాలయంలో పనిచేస్తున్న కామాడి వర్మ ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించారన్న కారణంగా సస్పెండ్ చేసినట్టు ఎంపీడీవో తెలిపారు. దీనిపై నివేదిక సమర్పించాలని ఆయా పంచాయతీల కార్యదర్శులను ఆదేశించారు.


పవన్‌కల్యాణ్ నుంచి పార్టీ నియమావళి అందుకుంటున్న దేవ వరప్రసాద్

రాజోలులో మళ్లీ జనసేన జెండాయే ఎగరాలి

» పార్టీ కేడర్‌కు పవన్‌కల్యాణ్ పిలుపు
» ఐఏఎస్ విశ్రాంత అధికారి వరప్రసాద్‌కు పార్టీ నియమావళి పత్రాలు అందజేత
» అసెంబ్లీ అభ్యర్థిగా దేవ వరప్రసాద్ పేరును అధికారికంగా ప్రకటించని వైనం
» అయోమయంలో జనసేన-మిత్రపక్ష కూటమి నేతలు

అమలాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాజోలు అసెంబ్లీ నియోజకవర్గంలో మళ్లీ జనసేన జెండా రెపరెపలాడాలని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో జనసేనను గెలిపించిన నియోజకవర్గ ఓటర్లు నాడు చూపించిన ఆదరణను నేడు మరింత పొందేలా ప్రణాళికలు సిద్ధం చేసి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలోని జనసేన రాష్ట్ర కార్యాలయంలో నియోజకవర్గ జనసేన నాయకుడు, ఐఏఎస్ విశ్రాంత అధికారి దేవ వరప్రసాద్‌తో బుధవారం పవన్‌కల్యాణ్ సమావేశమయ్యారు. రాజోలు నియోజకవర్గ ప్రజలు పార్టీ మీద ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. పార్టీ పరిస్థితులపై వారితో పవన్‌కల్యాణ్ సుదీర్ఘంగా చర్చించారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రణాళికాబద్ధంగా అనుసరించాల్సిన విధానాలను వివరించారు. అనంతరం వరప్రసాద్‌కు ఎన్నికల ప్రక్రియలో భాగంగా ప్రచారం, నామినేషన్ దాఖలుకు సంబంధించిన నియమావళి, నిబంధనలతో కూడిన పత్రాలను పవన్‌కల్యాణ్ అందజేశారు.

అభ్యర్థిని అధికారికంగా ఎందుకు ప్రకటించలేదు

రాజోలు అసెంబ్లీ జనసేన అభ్యర్థిగా దేవ వరప్రసాద్‌ను ఆ పార్టీ అధిష్ఠానం అధికారికంగా ప్రకటించిందా లేదా అనే దానిపై స్పష్టత లేకపోవడంతో నియోజకవర్గంలోని జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి నేతల్లో గందరగోళం మొదలైంది. పార్టీ ముఖ్య నేతలతో పాటు దేవ వరప్రసాద్‌తో పవన్‌కల్యాణ్ భేటీ అయి నియోజకవర్గ పరిస్థితులపై చర్చించి సూచనలు ఇచ్చారంటూ రాష్ట్ర పార్టీ కార్యాలయ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ అధికారికంగా ఒక లేఖ విడుదల చేశారు. అయితే ఆ లేఖలో ఎక్కడా అభ్యర్థిగా వరప్రసాద్‌ను ప్రకటించకపోవడం కేడర్‌లో చర్చనీయాంశమైంది. గతంలో నియోజకవర్గానికి వెళ్లి పనిచేసుకోవాల్సిందిగా పార్టీ ఇచ్చిన సూచనలతో వరప్రసాద్ నియోజకవర్గంలో పర్యటించారు. అయితే ఆయన పేరు ఖరారు కాలేదని వదంతులు వచ్చాయి. దీంతో పార్టీ కార్యాలయానికి మళ్లీ వెళ్లి పవన్‌కల్యాణ్‌తో భేటీ అయినప్పటికీ స్పష్టత లేకపోవడంతో కేడర్‌ను అయోమయానికి గురిచేస్తోంది. అయితే నామినేషన్ దాఖలుకు సంబంధించిన నియమావళి, నిబంధనలతో కూడిన పత్రాలను వరప్రసాద్‌కు పార్టీ అధినేతే అందజేశారంటే ఆయన్నే అభ్యర్థిగా ప్రకటించినట్టే కదా అని జనసేన కేడర్ చెప్తోంది.

వ్యర్థ సంకల్పం


బాలయోగి పార్కులో పడి వున్న స్వచ్ఛ సంకల్ప రిక్షాలు

» వినియోగంలో లేని స్వచ్ఛ సంకల్ప వాహనాలు
» నిర్వహణ సామర్థ్యం లేదంటున్న పంచాయతీలు
» ఎంపీడీవో కార్యాలయం వద్దే మట్టిలో కలిసిపోతున్న రిక్షాలు
» బుధవారం హడావిడిగా పంచాయతీలకు తరలింపు
» ఇప్పటికే పనికిరాకుండా పోయిన రిక్షాలు
» రూ.15.56 లక్షల ప్రజాధనం వృథా

"స్వచ్ఛ సంకల్పం... చెత్తరహిత గ్రామాలు... సంపూర్ణ పారిశుధ్య పంచాయతీలు.... తడి చెత్త, పొడిచెత్త, గ్రీన్ అంబాసిడర్లు... ఈ పదాలను గత కొన్నేళ్లుగా మనం వింటూనే వున్నాం. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాలి. దీని కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మనకు తెలిసిందే. అయితే పథకాల అమలుకు వ్యూహరచన చేసే అధికారులు వాటి అమలుపై కూడా పూర్తిగా దృష్టి సారిస్తే ఫలితముంటుంది. పథక రచన చేసి చేతులు దులుపుకుంటే ఫలితాలెలావుంటాయో స్వచ్ఛ సంకల్ప వాహన పథకం నిరూపిస్తోంది. పంపిణీ చేయని రిక్షాలు ఎంపీడీవో కార్యాలయాల వద్ద, పంపిణీ చేసినవి పంచాయతీల వద్ద మట్టిలో కలిసిపోతున్నాయి."

ఉప్పలగుప్తం, మార్చి 20:

కోనసీమ జిల్లాలోని 22 మండలాలకు 847 స్వచ్ఛ సంకల్ప రిక్షాలు సమకూర్చారు. వీటి ధర ఒక్కొక్కటి పన్నులతో కలిపి రూ.34,226. ఉదాహరణకు ఉప్పలగుప్తం మండలానికి రెండు విడతలుగా 42 రిక్షాలు అందించారు. కొన్ని పంచాయతీలు నామమాత్రంగా వాటిని తీసుకెళ్లి మూలన పడేశాయి. మిగిలినవి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోను, బాలయోగి పార్కులోను చెత్తలో కూరుకుపోతున్నాయి. కొన్ని రిక్షాల భాగాలు తుప్పుపట్టి వేరుపడడంతో కొందరు తరలించుకుపోయారు. పోయినవి పోగా మిగిలిన వాటికి మండల పరిషత్ కార్యాలయం వెనుక చోటు కల్పించారు. అయితే మంగళవారం 'ఆంధ్రజ్యోతి' రిక్షాల లెక్కలు అడగడంతో బుధవారం రిక్షాలను పంచాయతీలకు పంపించే ప్రయత్నాలు ప్రారంభించారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన ఒక్క వాహనాన్ని కూడా పంచాయతీలు వినియోగించకపోవడం గమనార్హం. సిబ్బందికే జీతాలు చెల్లించలేని పరిస్థితిలో గ్రీన్ అంబాసిడర్ల నియామకం ఎలా సాధ్యమని పంచాయతీల ప్రశ్న. గతంలో కొన్ని పంచాయతీలు గ్రీన్ అంబాసిడర్లను నియమించి ఏ పద్దు నుంచి జీతాలు చెల్లించాలో తెలియక అనంతరం కొన్ని నెలల్లోనే తొలగించాయి. ఈ పరిస్థితిని కనీసం గమనించకుండా చెత్త రిక్షాలు ఇవ్వడం వ్యర్థం కాదా అని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పథకాల పేరుతో ప్రజా ధనాన్ని వృథా చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నిస్తున్నారు.

పంపిణీలో లోపం లేదు

కొఠారి వెంకటేశ్వర ప్రసాద్, ఎంపీడీవో, ఉప్పలగుప్తం

స్వచ్ఛ సంకల్ప రిక్షాలు వచ్చి చాలా కాలమైంది. అయితే కొన్ని పంచాయతీలు మాత్రమే రిక్షాలను తీసుకెళ్లాయి. రిక్షాలు నిలిపేందుకు చోటు లేదన్న కారణంగా మరికొన్ని పంచాయతీలు ఇక్కడే వదిలేశాయి. వాటిని తీసుకుపోవాలని పంచాయతీలను ఆదేశించాం.

రిక్షాల నిర్వహణ సమస్యను పరిష్కరించాలి



చిక్కం జంగమయ్య, సర్పంచ్, సన్నవిల్లి

చెత్త సమస్యపై ప్రభుత్వాలు అత్యంత శ్రద్ధ తీసకుంటున్న తీరు హర్షణీయమే. స్వచ్ఛ సంకల్ప వాహనాలను పంచాయతీలకు ఇచ్చే ముందు నిర్వహణకు తగిన ఆర్థిక వనరులు సమకూర్చడం పాలకుల బాధ్యత. ఆర్థిక పరిష్కారం చూపించకుండా రిక్షాలు ఇస్తే అసలే సిబ్బందికి సమయానికి జీతాలివ్వలేక నానా అగచాట్లు పడుతున్న మైనర్ పంచాయతీలు చెత్త సమస్యను ఎలా పరిష్కరిస్తాయి? నిజానికి రిక్షాలు పంచాయతీల్లోనే విశ్రాంతి తీసుకుంటున్నాయి. ఇప్పుడైనా రిక్షాల నిర్వహణకు వనరులు సమకూర్చేలా ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపిస్తే బాగుంటుంది.


రిక్షాలను బుధవారం హడావిడిగా భీమనపల్లి తరలిస్తున్న దృశ్యం

పదో తరగతి ఇంగ్లిషు పరీక్ష ప్రశాంతం

ముమ్మిడివరం, మార్చి 20: పదో తరగతి పరీక్షలో మూడవది అయిన ఇంగ్లిషు పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని 112 కేంద్రాల్లో 19,346 మందికి 18,981మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 365 మంది గైర్హాజరైనట్టు డీఈవో ఎం.కమలకుమారి తెలిపారు. డీఈవో ఏడు,డీవైఈవో ఎన్.ఫణి ఎనిమిది, సహాయ కమిషనరు నాలుగు, ఫ్లయింగ్ స్క్వాడ్ 28 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీసు, మాస్ కాపీయింగ్ జరగలేదని డీఈవో చెప్పారు.

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి

అమలాపురం టౌన్, మార్చి 20: జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులు, స్టాఫ్ నర్సులు వారి వివరాలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగంగా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర కోరారు. రిజిస్ట్రేషన్ చేయించుకోని పక్షంలో సెంటర్ల కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యువల్ రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తామన్నారు.


బాలయోగి స్టేడియంలో పతంగులు ఎగురవేస్తున్న రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కేశవర్ధనరెడ్డి, పలువురు అధికారులు

ఓటువేసి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి: ఆర్డీవో

అమలాపురం టౌన్, మార్చి 20: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదై ఓటు హక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని అమలాపురం ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి జి.కేశవర్ధనరెడ్డి యువతకు పిలుపునిచ్చారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో 'స్వీప్' పేరిట అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఓటు హక్కు ఆవశ్యకత నినాదాలతో రూపొందించిన పతంగుల పండుగలో పాల్గొని వాటిని ఎగురవేశారు. ప్రశాంత వాతావరణంలో ఎటువంటి భయాందోళనలకు ఆస్కారం లేకుండా పౌరులు ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. మొదటిసారి ఓటర్లు, థర్డ్ జెండర్, సర్వీసు ఓటర్లు, సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్‌లపై అవగాహన పెంపొందించేలా పలు కార్యక్రమాలు రూపొందించి ప్రచారం చేపట్టామన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ మధుసూదన్, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, ఆదిత్య, విద్యానిధి, ఢిల్లీ పబ్లిక్ స్కూలు, సర్ సీవీ రామన్ పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

కట్టుదిట్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు

అమలాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఆయన సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్వో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర ఎంత ఉందో రాజకీయ పార్టీల నుంచి కూడా అంతే సహకారం అవసరమన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినందున పార్టీల గుర్తులు, రాజకీయ నేపథ్యం ఉన్న వ్యక్తులకు సంబంధించిన ఫొటోలు, ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణకు ఎటువంటి కొరత లేకుండా సిబ్బందిని సిద్ధం చేశామన్నారు. సభలు, సమావేశాలు, వాహనాలు అన్నింటికీముందస్తు అనుమతి పొందాలన్నారు. సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టమ్, సువిధ యాప్ ద్వారా అనుమతి ఇస్తామన్నారు. ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సెక్షన్ సూపరింటెండెంట్ టి.వైద్యనాథ్‌శర్మ, కలెక్టరేట్ పరిపాలనాధికారి సీహెచ్ వీరాంజనేయప్రసాద్, నాయకులు కామన ప్రభాకరరావు, దూరి రాజేష్, అల్లాడి స్వామినాయుడు, కారెం వెంకటేశ్వరరావు, కాశి లక్ష్మీభవానీ, సంసాని బులినాని తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.93.10 లక్షలు... 7లో

భరతం పడుతుంది

సార్వత్రిక ఎన్నికల (2024) షెడ్యూల్ విడుదల అయ్యింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లోకి వచ్చేసింది. ఈ నేపథ్యంలో అక్రమాలకు, నిబంధనల ఉల్లంఘనలకు అవకాశం ఎక్కువగా ఉన్నాయి. ఎలాగైనా సరే గెలవాలనే ఆలోచనతో అధికారాన్ని అడ్డం పెట్టుకుని రెచ్చిపోవచ్చు. ఎన్నికల నిబంధనలను సైతం తుంగలో తొక్కేవాళ్లు లేకపోలేదు. ఏ రాష్ట్రంలో లేని విధంగా వలంటీర్ల వ్యవస్థ అధికార పార్టీ కనుసన్నల్లో పనిచేసేందుకు సిద్ధమవుతోంది. అవినీతి కార్యకలాపాలు కావచ్చు..నిబంధనల ఉల్లంఘన కావచ్చు.. శాంతిభద్రతల అంశం కావచ్చు..ఎక్కడ ఏం జరుగుతుందో తెలియదు. అది ఎలాంటి ఉపద్రవానికి దారి తీస్తుందో తెలియదు. అయితే వాటికి అడ్డుకట్ట వేయడానికి ఎలక్షన్ కమిషన్ ఓ దివ్యాస్త్రాన్ని తీసుకువచ్చింది. అదే 'సి విజిల్ యాప్'

● పెద్దాపురం/సామర్లకోట

ఎన్నికల వేళ పౌరుల చేతిలో దివ్యాస్త్రం సి విజిల్ యాప్ నిబంధనల ఉల్లంఘనలు, అక్రమాలపై స్పాట్‌లో ఫిర్యాదు చేసే సాంకేతిక పరిజ్ఞానం

అసలు ఏంటీ యాప్..

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఈ సి విజిల్ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా అందులో పొందుపరచవచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డ్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన 5 నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి 100 నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకుంటారు. దీన్ని పౌరులు ఎవరైనా వినియోగించవచ్చు. పార్టీలకు అతీతంగా ఎవరు అవినీతికి పాల్పడినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

5 నిమిషాల్లో

యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి 5 నిమిషాల్లో దానిని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారు. విచారించి 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు. ఆయన దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా 100 నిమిషాల్లో సి విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారు. మీరు చేసిన ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది.





రిజిస్ట్రేషన్ ఇలా చేసుకోండి..

గూగుల్ ప్లే స్టోర్‌లో కేంద్ర ఎన్నికల సంఘం వారి సి విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. మీఫోన్ నంబరు ద్వారా దానిలో రిజిస్టర్ చేసుకోవాలి. ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేస్తే సి విజిల్ యాప్ సిద్ధమైనట్లే. దీని ద్వారా మీరు ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.



వీటిపై ఫిర్యాదు చేయవచ్చు..

డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతులు అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం, ఇలాంటి ఉల్లంఘనలను ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రికార్డ్ చేసి అప్‌లోడ్ చేయండి.







ఫిర్యాదు చేసే విధానం

యాప్ ఓపెన్ చేయగానే తెరపై ఫొటో, వీడియో, ఆడియో అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. ఫొటో ద్వారా ఫిర్యాదు చేయాలనుకుంటే ఫొటో ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. లోకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఫొటోను అప్‌లోడ్ చేయండి. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం అనే వివరాలను నమోదు చేయాలి. ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి.





అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకే..

జె.సీతారామారావు, ఆర్డీవో ఎన్నికల రిటర్నింగ్ అధికారి

ఎన్నికల్లో ఎటువంటి అక్రమాలు జరగకుండా వాటికి అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం సి విజిల్ యాప్‌ను రూపొందించింది. ఎన్నికల్లో అరాచకాలు, అక్రమాలకు పాల్పడే వారిని ఈ యాప్ ద్వారా పట్టించి వారికి చరమగీతం పాడొచ్చు. సి విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘనలు కనిపిస్తే ఫిర్యాదు చేయండి.

జంట హత్యలు

- కాకినాడ జిల్లా చేబ్రోలులో కలకలం
- వివాహేతర సంబంధాల నేపథ్యంలో దారుణ ఘటన



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గొల్లప్రోలు రూరల్, మార్చి 20: తనతో సహజీవనం చేస్తున్న మహిళ మరొకరితో సన్నిహితంగా ఉండడాన్ని ఓ వ్యక్తి జీర్ణించుకోలేకపోయాడు. వారిని అంతమొందించి కక్ష తీర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. సహజీవనం చేస్తున్న మహిళను, ఆమెతో సన్నిహితంగా ఉంటున్న వ్యక్తిని కత్తితో పొడిచి చంపేశాడు. సదరు మహిళ తల్లిపై కూడా దాడి చేయడంతో ఆమె తీవ్రగాయాలతో చికిత్స పొందుతోంది.. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో బుధవారం జరిగిన ఈ సంఘటన సంచలనం రేకెత్తించింది. చేబ్రోలు గ్రామానికి చెందిన పెండ్యాల లోవ(39) అనే మహిళ కొంతకాలంగా భర్తకు దూరంగా ఉంటున్నది. ఆమె అదే గ్రామానికి చెందిన లోకా నాగబాబుతో కొంతకాలంగా సహజీవనం చేస్తోంది. తనతో కాకుండా లోవ ఇదే గ్రామంలోని పోసిన శ్రీనివాస్(45)తో సన్నిహితంగా ఉంటుండడంతో వారి మధ్య సంవత్సరకాలంగా వివాదాలు జరుగుతున్నాయి. పలుమార్లు లోవను హెచ్చరించినా లెక్క చేయకపోవడంతో ఆగ్రహించిన నాగబాబు పలుమార్లు వారిపై దాడికి ప్రయత్నించాడు. బుధవారం ఉదయం చేబ్రోలు శివారులోని పెద్దింటమ్మతల్లి గుడి వద్ద అత్యంత సన్నిహితంగా వారిద్దరూ ఉండడాన్ని గుర్తించి నాగబాబు ఇద్దరిపై కత్తితో దాడి చేసి విచక్షణారహితంగా నరికి హత్య చేశాడు. అనంతరం లోవ, శ్రీనివాస్‌ల మధ్య సంబంధాన్ని ప్రోత్సహిస్తుందనే కోపంతో లోవ తల్లి విసరపు లక్ష్మీపై కత్తితో దాడి చేసి అక్కడ నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జంట హత్యలు చేబ్రోలు పరిసర గ్రామాల్లో కలకలం సృష్టించాయి. హత్యకు గురైన ఇద్దరు రక్తపుమడుగులో ఉండిపోయారు. సంఘటనా స్థలాన్ని జిల్లా అడిషనల్ ఎస్పీ భాస్కరరావు, కాకినాడ డీఎస్పీ హనుమంతరావు, ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ పరిశీలించారు. కాగా హత్యకు గురైన లోవకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమార్తెకు ఇటీవలే వివాహం జరిగింది. పోసిన శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



లోవ (ఫైల్‌ఫొటో)



పోసిన శ్రీనివాస్

12 రకాల గుర్తింపు కార్డులు



అమలాపురం టౌన్/కలెక్టరేట్(కాకినాడ), మార్చి 20: ఓటు హక్కును వినియోగించుకునేందుకు 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి వినియోగించుకోవచ్చునని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డులో అక్షర దోషాలు ఉన్నా ఆ ఓటరు నిజమైన ఓటరేనని నిర్ధారించుకున్న తర్వాత ఓటు వేయడానికి అనుమతి ఇస్తారన్నారు. ఓటరు గుర్తింపు కార్డులో ఫొటో తప్పుగా ఉంటే మాత్రం ఇతర 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపి ఓటు వేయవచ్చునన్నారు. ఓటర్ల జాబితాలో నమోదైన ఓవర్‌సీస్ ఓటర్లు ఒరిజినల్ పాస్‌పోర్టును గుర్తింపుగా మాత్రమే చూపించి ఓటు వేయాల్సి ఉంటుందని, ఇతర గుర్తింపు కార్డులను అనుమతించబడవన్నారు. ఓటు హక్కు వినియోగానికి సూచించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, బ్యాంకు, పోస్టాఫీసులు జారీచేసిన పాసు పుస్తకాలు, కార్మిక మంత్రిత్వశాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్సు స్మార్ట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాన్‌కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, ఫొటోతో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్, కంపెనీలు జారీచేసిన ఉద్యోగ గుర్తింపుకార్డులు, సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వశాఖ జారీ చేసిన దివ్యాంగుల గుర్తింపు కార్డులో ఏదో ఒకటి చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్



కలెక్టరేట్(కాకినాడ),మార్చి 20: ఎన్నికల విధుల్లో ఉన్న జర్నలిస్టులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు విని యోగించుకోవచ్చునని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. దీనికి అవసరమైన ఫారమ్ 12 (డి) దరఖాస్తును పొందాలన్నారు. అయితే అక్రిడిటేషన్ కార్డుతో పాటు ఎసెన్షియల్ సర్వీసెస్ షీట్‌ను నింపి ఈనెల 22వ తేదీ ఉదయం 11 గంటలలోపు 9494156640 నెంబర్‌కు వాట్సాప్ చేయాలన్నారు. ఇలా వాట్సాప్ చేసిన వారికి మాత్రమే పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఉంటుందని కలెక్టర్ కృతికా శుక్లా చెప్పారు.

లారీ ఢీకొనడంతో ఇద్దరు మహిళలు మృతి

లలితా ఇండస్ట్రీస్‌లో ఘటన



పెద్దాపురం, మార్చి 20: కాకినాడ జిల్లా పెద్దాపురం నుంచి వాలుతిమ్మాపురం వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న లలితా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఇద్దరు మహిళా కార్మికులు లారీ ఢీకొని మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దాపురం రాజీవ్ కాలనీకి చెందిన కామిశెట్టి కామేశ్వరి (51), పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామానికి చెందిన మోటుపల్లి నాగరత్నం (65) ఇద్దరూ రైస్ మిల్లులో విధులకు రోజూలాగే హాజరయ్యారు. మధ్యాహ్నం భోజనాల అనంతరం మళ్లీ యథావిధిగా పనులు చేసుకుంటుండగా ఇంతలో వర్షం కురవడంతో పక్కనే ఉన్న గోడ వద్ద నిలబడ్డారు. ఇంతలో అక్కడే ఉన్న లారీని డ్రైవర్ బ్యాక్ చేస్తున్నాడు. గోడ వద్ద నిలబడి ఉన్న వారిని డ్రైవర్ గమనించకుండా వెనక నుంచి బలంగా ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఇద్దరూ కూలీలు మృతిచెందారు. నాగరత్నానికి నలుగురు కుమారులు కాగా మిల్లులో పనిచేసుకోవడంతో పాటు పింఛన్ సొమ్ముతో జీవనం సాగిస్తోంది. కామేశ్వరి భర్త మృతిచెందగా రైస్‌మిల్లు ద్వారా వచ్చిన ఆదాయంతోనే జీవనం సాగిస్తోంది. ఇదిలా ఉండగా ఫ్యాక్టరీ యాజమాన్యం కూలీలు మృతిచెందిన విషయం బయటకు తెలియకుండా గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించింది. మృతదేహాలను స్థానిక ఆసుపత్రికి గుట్టచప్పుడు కాకుండా తరలించింది. వివరాలు నమోదు చేయకుండా మృతదేహాలను మార్చురీలో పెట్టి ఆసుపత్రి సిబ్బంది తాళాలు వేయడంతో పలు అనుమానాలు కలుగుతున్నాయి. ఈ విషయంపై ఎస్ఐ సురేష్ సం ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అలాగే కేసును దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ డీసీహెచ్‌ఎస్ రమేష్‌కిశోర్‌పై కొనసాగుతున్న విచారణ

కొవ్వూరు, మార్చి 20: గతంలో తూర్పుగోదావరి జిల్లా డీసీహెచ్‌ఎస్‌గా పనిచేసిన డాక్టర్ టి.రమేష్‌కిషోర్‌పై ప్రభుత్వానికి అందిన ఫిర్యాదుల నేపథ్యంలో బుధవారం కొవ్వూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విచారణ చేపట్టారు. విచారణ అధికారి, విజయనగరం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బి.గౌరీ శంకరరావు ఫిర్యాదుదారులను, అప్పట్లో పనిచేసిన వైద్యులు, వైద్య సిబ్బందిని ఒక్కొక్కరిగా పిలిచి విచారించారు. డాక్టర్ బి.గౌరీశంకరరావు మాట్లాడుతూ అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ న్యాయవాదులు గొట్టిముక్కల అనంతరావు, ధర్నాలకోట వెంకటేశ్వరరావులు గతంలో తూర్పుగోదావరి జిల్లా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ టి.రమేష్‌కిషోర్‌పై ప్రభుత్వానికి, మెడికల్ అండ్ హెల్త్ విజిలెన్స్ అధికారులకు, జిల్లా కలెక్టర్ స్పందనలోను 2021 జూన్ 18వ తేదీన ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిందన్నారు. రమేష్‌కిషోర్ రాజమహేంద్రవరం ఆసుపత్రిలో ఎక్కువ కాలం పనిచేశారని, మహిళా ఉద్యోగులను వేధించడంతో వేధింపులు తాళలేక ఉద్యోగులు మెడికల్ లీవులు పెట్టారని, ఆరోగ్యశ్రీ డాక్టర్లకు ఇచ్చిన సొమ్మును సొంత అవసరాలకు వాడుకున్నారని, గ్లౌజులు పేమెంట్లతో కొనుగోలు చేయించారని, 8సంవత్సరాలుగా బది లీ చేయకుండా ఎలా ఒకేచోట ఉంచారని వచ్చిన ఫిర్యాదులపై అప్పట్లో పనిచేసిన వైద్య సిబ్బందిని, ఫిర్యాదుదారులను, డాక్టర్లను విచారించారన్నారు. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

దాట్ల దేవదానంరాజుకు పురస్కారం



దేవదానంరాజును సత్కరిస్తున్న ప్రముఖులు

యానాం, మార్చి 20: కథకుడు, బహుగ్రంథకర్త దాట్ల దేవదానం రాజుకు సృజనాత్మక సాహిత్యం విభాగంలో పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం కీర్తి పురస్కారం ప్రదానం చేసింది. హైదరాబాద్‌లోని విశ్వ విద్యాలయం ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన పురస్కార సభలో తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ టి.కిషన్‌రావు, మెట్రోరైల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి, రిజిస్ట్రార్ భట్టు రమేష్ పురస్కారాన్ని అందించారు. దాట్ల దేవదానంరాజుకు పురస్కారం లభించడంతో కళైమామణి విష్ణుమూర్తి, శిఖామణి, పీఆర్‌ఎల్ స్వామి, మధునాపంతుల సత్యనారాయణమూర్తి, ముమ్మిడి నాగప్రసాద్, చింతా కొండలరావు, జిమ్మి, రామ్మోహనరావు, డాక్టర్ శివప్రసాద్‌లు అభినందనలు తెలిపారు.

కల్యాణం..కమనీయం

కోరుకొండ లక్ష్మీనరసింహుని పరిణయం



కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కోరుకొండ, మార్చి20: కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి శ్రీ భూసమేత అనంత పద్మనాభ స్వామి వార్ల దివ్య కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి 11గంటలకు అంగరంగ వైభవంగా జరిగింది. ఒకే రోజు ఒకే శుభ ముహూర్తంలో ఇటు లక్ష్మీనరసింహస్వామి వారికి, క్షేత్ర పాలకుడైన శ్రీ భూ సమేత అనంత పద్మనాభ స్వామి వారికి కల్యాణం నిర్వహించారు. రథోత్సవం అనంతరం బుధవారం రాత్రి స్వామివారిని, అమ్మవారిని రథం పై నుంచి ఎదుర్కోలుతో నూతన వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు సమర్పించి ఆలయానికి తీసుకుని వచ్చారు. అక్కడ స్వామివారికి, అమ్మవారికి మంగళస్నానాలు జరిపించారు. అనువంశిక ధర్మకర్తలు పరాసర లక్ష్మీనరసింహభట్టర్, పరాసర రంగరాజ భట్టర్ పర్యవేక్షణలో ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవాలను పెద్దింటి రంగా ప్రసాద్ దంపతులు, పెద్దింటి చంటిబాబు దంపతులు పీటలపై కూర్చుని జరిపించారు. వీరితో పాటు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు, అన్నవరం దేవస్థానం జాయింట్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ మరో 300 మంది యజమాన దంపతులు స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణ మహోత్సవం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి తుమ్మిడి బ్రదర్స్, కోరుకొండ గ్రామ పంచాయతీ వారు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. స్వామి వారి కల్యాణ మహోత్సవాలు తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

కనుల పండువగా రథోత్సవం

కోరుకొండ, మార్చి20: కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అంతకుముందు స్వామివారిని, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకరించి శాస్త్రోక్తంగా కార్యక్రమాలను నిర్వహించారు. ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అనువంశిక అర్చక స్వాములు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నవరం దేవస్థానం అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో ఎస్వీ రంగరాజభట్టర్, లక్ష్మీనరసింహస్వామి భట్టర్ సమక్షంలో రథానికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజశ్రీ దంపతులు, బీజేపీ నాయకుడు నీరుకొండ వీరన్నచౌదరి, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు గోవిందా అంటూ రథాన్ని ముందుకు లాగారు. భక్తుల భజనలు, గరగ నృత్యాలు, కోలాట నృత్యాలు, మంగళ వాయిద్యాలు, మేళతాళాలు, భక్తుల గోవింద నామస్మరణలతో రథోత్సవం ఘనంగా జరిగింది. వర్షం రాకతో రెండుసార్లు రథోత్సవానికి ఆటంకం కలిగింది. అనంతరం సాయంత్రం దిగ్విజయంగా ముందుకు సాగింది. వేలాది మంది భక్తులు అరటిపండ్లు స్వామి వారి రథంపై వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు లేకుండా వర్షపు జల్లుల మధ్య స్వామి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వెంకన్న హుండీల ఆదాయం రూ.93.10 లక్షలు



ఆత్రేయపురం, మార్చి 20: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారులు డి.నాగమల్లేశ్వరరావు, ఎం.రాధాకృష్ణ, బి.కిరణ్, బి.నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. 28 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.71,44,868, అన్న ప్రసాద హుండీల ద్వారా రూ.21,65,525... మొత్తం రూ.93,10,393 ఆదాయం లభించింది. బంగారం 40 గ్రాములు, వెండి కిలో, వివిధ దేశాల కరెన్సీ లభి ంచింది. క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.2,36,159 లభించినట్టు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఉప కమిషనర్, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. లెక్కి ంపులో ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు పశువుల కాపరి మృతి

కాకినాడ జిల్లా వ్యాప్తంగా దంచికొట్టిన వర్షం



కాకినాడలో వడగండ్లు

గండేపల్లి వద్ద హైవేపై వర్షపు నీరు

ప్రత్తిపాడు, మార్చి 20: కాకినాడ జిల్లా వ్యాప్తంగా బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రత్తిపాడు మండలం టి.రాయవరం గ్రామంలో బుధవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై పశువుల కాపరి మృతి చెందగా మరొక యువకుడు గాయపడ్డాడు. రాయవరం గ్రామానికి చెందిన పద్దేటి మహేష్(28)నాలుగు గేదెలను మోపుకుంటూ రాయవరం సమీపంలోని వంతెన వద్ద పొలంలో ఉండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అదే క్రమంలో పిడుగు పడటంతో పొలంలో గొడుగుతో పశువులను కాస్తున్న మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ సంఘటనకు సమీపంలో రహదారిపై ఉన్న కొండి సత్తిబాబు గాయపడ్డాడు. గ్రామంలో పద్దేటి కృష్ణ, సావిత్రి దంపతుల మూడో కుమారుడు మహేష్ ఆకస్మిక మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ తటవర్తి సుబ్బారావు, ఎంపీటీసీ రామన్న దొర పరామర్శించి సానుభూతి తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. సంఘటనాస్థలాన్ని వీఆర్వో ప్రసాద్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఉపాధ్యాయులతో వెంకటదుర్గ

ఐ.పోలవరం, మార్చి 20: అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.వేమవరం హైస్కూల్ విద్యార్థిని బొమ్మిడి పూర్ణిమవెంకటదుర్గ ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 26 నుంచి అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటుందని పీడీ జి.కళావతి తెలిపారు. వెంకటదుర్గను బుధవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. దుర్గకు తర్ఫీదునిచ్చిన కళావతిని, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జంపా హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి అడ్డగళ్ల నాగరామప్రసాద్‌ను సన్మానించారు. జడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, సర్పంచ్ నల్లా సుదర్శన్‌రావు, సొసైటీ అధ్యక్షుడు మెండా వెంకన్న, పీఎంసీ చైర్మన్ మద్దింశెట్టి వరలక్ష్మి పాల్గొన్నారు.

● సమాయత్తం కావాలని వక్తలు పిలుపు
● టీడీపీ-జనసేన పార్టీ నాయకుల సమావేశం
● సూపర్-6 పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

గర్భిణులకు సీమంతాలు

మలికిపురం, మార్చి 20: ప్రభుత్వం మాతాశిశు సంరక్షణకు అందించే ప్రతీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజోలు ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి అన్నారు. ఉయ్యూరివారిమెరక అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ్ పక్వాడ్‌లో భాగంగా బుధవారం గర్భిణులకు సీమంతాలు, అన్నప్రాసనలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె.చంద్రకళ, ప్రసన్నరాజీ, హైమావతి, సరోజిని, అంగన్‌వాడీ కార్యకర్తలు బీవీ రత్నకుమారి, ఎ.కుమారిదుర్గ, కె.రత్నకుమారి, జె.నందిని, నాగమ్మ, ఎస్తేరు పాల్గొన్నారు.

ఇవేమి నిబంధనలు..



అమలాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట, అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద, మామిడికుదురు తహసీల్దార్ కార్యాలయం వద్ద కాటన్ విగ్రహాలకు ముసుగులు



అంబాజీపేట: పుల్లేటికుర్రు సొసైటీ క్రింద వైసీపీ రంగులతో ప్రచార కార్యాలయంగా ఉన్న ఆర్బీకే

పలు చోట్ల కాటన్ విగ్రహాలకు ముసుగులు

అమలాపురం రూరల్, మార్చి20: ఇవేమి నిబంధనలో.. అమలాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బస్ట్ సైజులో ఉన్న సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ముసుగు వేశారు. అదే రోడ్డులో కాటన్ పార్కులో ఆర్డీవో కార్యాలయం ఎదురుగా ఉన్న నిలువెత్తు కాటన్ విగ్రహానికి ముసుగు వేయలేదు. అక్కడ వేసి ఇక్కడ ఎందుకు వేయలేదు. అసలు సార్వత్రిక ఎన్నికలకు కాటన్‌దొరకు సంబంధం ఏమిటన్న ప్రశ్నలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇక బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. నడిపూడి మెయిన్‌రోడ్డు పక్కన ఉన్న మాజీ ఉపప్రధానిబాబూజగ్జీవన్‌రామ్ విగ్రహానికి ముసుగేశారు.

వైసీపీ కార్యాలయంగా ఆర్బీకే

అంబాజీపేట, మార్చి 20: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కాటన్ విగ్రహానికి అధికారులు ముసుగు వేశారు. పుల్లేటికుర్రులో సొసైటీ కింద భాగంలో ఉన్న రైతు భరోసా కేంద్రం వైసీపీ ప్రచార కార్యాలయంగా మారింది.

కాటన్ రాజకీయ నాయకుడా!

మామిడికుదురు, మార్చి 20: ఎన్నికలకోడ్‌లో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని కాటన్ విగ్రహానికి ముసుగు వేయడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసిన ముసుగును తొలగించాలని కోరుతున్నారు.

స్వామి వివేకానందునికీ ముసుగేశారు!

ఆలమూరు, మార్చి20: ఎన్నికల కోడ్‌లో భాగంగా రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తారు. జొన్నాడలో అధికారులు స్వామివివేకానంద విగ్రహానికి ముసుగు వేశారు. ఈవిషయాన్ని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గాంధీ, అంబేడ్కర్ మినహా మిగిలిన అన్ని విగ్రహాలకు ముసుగులు వేయాలని ఉన్నతాధికారులు సూచించిన మేరకు తాము ఇలా చేశామని చెప్పారు. తర్జనభర్జనల అనంతరం వివేకానంద విగ్రహానికి వేసిన ముసుగును తొలగించారు.

అవినీతిలో కూరుకున్న వైసీపీని గద్దె దింపాలి

ముమ్మిడివరం, మార్చి 20: అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు సమాయత్తం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. అయినాపురంలో బొంతు నాగరాజు అధ్యక్షతన బుధవారం టీడీపీ-జనసేన పార్టీ నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్-6 పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అస్తవ్యస్తంగా మారిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దాలంటే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ద్వారానే సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో దాట్ల పృథ్విరాజ్, అర్ధాని శ్రీనివాసరావు, పొత్తూరి విజయభాస్కరవర్మ, చిక్కాల అంజిబాబు, పాకలపాటి మురళీ, యిందుకూరి పాండురంగరాజు, దూనబోయిన పరిపూర్ణ సత్యనారాయణ, అయ్యల శ్రీనివాస్, చిక్కాల బాబులు, కోరశిక



అయినాపురం టీడీపీ సమావేశంలో మేనిఫెస్టో పత్రాలు అందజేస్తున్న దృశ్యం

రాము, మట్ల సత్తిబాబు, సత్తి నూకరాజు, బొక్కా దర్మారావు, సబ్బతి డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టో..

తెలుగుదేశంతోనే అన్నివర్గాల సంక్షేమం సాధ్యమవుతుందని, రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు గెలుపునకు ప్రతీ ఒక్కరు కృషిచేయాలని టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు(బాలు) కోరారు. బుధవారం కొమానపల్లిలోని టీడీపీ, జనసేన పార్టీ గ్రామ కమిటీల ఆధ్వర్యంలో మొల్లివారిపేట, చెరువుగట్టు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించి మేనిఫెస్టో క్యాలెండర్లను అందజేశారు. కార్యక్రమంలో కుంచనపల్లి నారాయణ, మెండా జగన్నాథం, కుంచనపల్లి వెంకన్నబాబు, మారెల్ల శ్రీనివాసరావు, మొల్లి వెంకటరత్నం, మెల్లి సత్తిబాబు, మొల్లి దుర్గారావు, మొల్లి శివ పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ



ఆలమూరు: పెదపళ్ల రామాలయంలో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ

ఆలమూరు, మార్చి 20: పెదపళ్ల, చిలకలపాడు గ్రామాల్లో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ బుధవారం వైభవంగా జరిగింది. పెదపళ్లలో సీతారామ, లక్ష్మణ, హనుమాన్ శిలా విగ్రహాలను వేద పండితుడు వాడపల్లి గోపాలాచార్యులు పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. చిలకలపాడులో విగ్రహాల ప్రతిష్ఠ అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా వార్షికోత్సవ పూజలు

మామిడికుదురు, మార్చి 20: మామిడికుదురులో వేంచేసి ఉన్న శ్రీపార్వతి రామలింగేశ్వరస్వామి సన్నిధిలో పదకొండవ వార్షికోత్సవ పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. రామలింగేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. జగన్నాథశర్మ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పలువురు భక్త దంపతులు కర్తలుగా పాల్గొని పూజలు నిర్వహించారు.

స్వామివారి కల్పవృక్ష వాహన మహోత్సవం

రావులపాలెం, మార్చి 20: రావులపాలెంలోని శ్రీఅలమేలుమంగ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కల్పవృక్ష వాహనసేవ జరిగింది. ఉదయం స్వామివారికి అర్చనలు,అభిషేకాలు, పూజలు జరపగా భక్తులు, గోవింద మాలధారులు తిలకించారు.

శ్రీవేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

కపిలేశ్వరపురం, మార్చి 20: అంగరలో కొలువైయున్న శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి రథోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈనెల26 వరకు జరిగే స్వామివారి వార్షిక దివ్యకల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం పెద్దింటి వెంకటలక్ష్మీనరసింహాచార్యులు, ఆలయ అర్చక సోదరులు స్వామివార్కి ప్రత్యేకపూజలు, బాలభోగం, నిత్యహో



మలికిపురం: మోరి మహాలక్ష్మమ్మ, కనకమహాలక్ష్మమ్మ అమ్మవార్లు

మాలు, బలిహరణ తదితర పూజలు శాస్త్రోక్తంగా జరిపారు. మధ్యాహ్నం స్వామివారి రథోత్సవం, పోలేరమ్మ ఆలయం వద్ద తీర్థం, రాత్రి స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

శ్రీభక్తాంజనేయ, వినాయక విగ్రహాల ప్రతిష్ఠ

కపిలేశ్వరపురం, మార్చి 20: కపిలేశ్వరపురం పెద్దవంతెన వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం శ్రీభక్తాంజనేయస్వామి, శ్రీవరసిద్ధి వినాయక స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. వేదపండితులు తంగిరాల దత్తాత్రేయ శర్మ ఆధ్వర్యంలో రెండు రోజులు విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. బుధవారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. గ్రామస్తుల ఆర్థిక సహాయంతో ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, చింతాపెదకాపు, భక్తులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహ ప్రతిష్ఠ

అంతర్వేది, మార్చి 20: అంతర్వేదిరావివారి గ్రూపులో నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం ఉదయం 10.08గంటలకు రావి కనకరాజు-భాగ్యలక్ష్మీదేవి చేతులమీదుగా విఘ్నేశ్వర విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పూర్ణాహుతి, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన అఖండ అన్నసమారాధనలో ప్రసాదం స్వీకరించారు.

సత్యనారాయణస్వామి పెళ్లికొడుకాయే

మామిడికుదురు, మార్చి 20: మాకనపాలెంలో వేంచేసి ఉన్న శ్రీసత్యనారాయణస్వామి బుధవారం పెళ్లికొడుకాయెను. శ్రీఅనంతలక్ష్మి భూదేవి సమేత సత్యనారాయణస్వామివారి కల్యాణోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఫాల్గుణ మాసం శుక్లపక్షం శుభ ముహూర్తాన గ్రామానికి చెందిన సలాది వెంకటేశ్వరరావు-నాగమణి దంపతులు అమ్మవారితో పాటు సత్యనారాయణస్వామివారికి బొట్టుపెట్టి, కల్యాణ తిలకం దిద్ది వారిని పెళ్లికుమార్తెను, పెళ్లి కుమారుడిగా అలంకరించారు. ఆలయాన్ని విద్యుత్ అలంకరణలతో తీర్చిదిద్దారు. కల్యాణోత్సవాలు నేపథ్యంలో ఈనెల25వరకు పూజలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ తెలిపింది.



రావులపాలెం: కల్పవృక్ష వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

మహాలక్ష్మమ్మ, కనకమహాలక్ష్మమ్మ తీర్థ మహోత్సవాలు

మలికిపురం, మార్చి 20: మోరి మహాలక్ష్మమ్మ, కనకమహాలక్ష్మమ్మ జాతర తీర్థ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి జాతర వైభవంగా జరిగింది. ఆకులవారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జాతర జరిగింది. జాతరలో అంగరవారి గారడీలు, తాడేపల్లిగూడెం శక్తివేషాలు, ఏలూరి కాంతారా నృత్యాలు, పెనుగొండవారి బుట్టబొమ్మలు, మచిలీపట్నం వాయిద్యాలు, విలసవిల్లివారి డోలు సన్నాయిలు, ఆసాదుల గరగ నృత్యాలతో మోరి మహాలక్ష్మమ్మ, కనకమహాలక్ష్మమ్మ జాతర వైభవంగా జరిగింది. మోరి పురవీధుల్లో ఏర్పాటుచేసిన విద్యుద్దీపాలంకరణలు, పలుచోట్ల ఏర్పాటు చేసిన సెట్టింగులు కన్నులవిందుగా ఉన్నాయి. గురువారం అమ్మవారిని హంస వాహనంపై నగరోత్సవం జరిపిస్తారు. అమ్మవారి కార్యక్రమాలు పది రోజులు వైభవంగాజరుగుతాయి.

బీవీసీ విద్యార్థుల డిజిటల్ ప్రచారం

అల్లవరం, మార్చి 20: ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు జాతీయ సేవా వారోత్సవాల్లో భాగంగా బుధవారం బెండమూర్లంక శివారు ఆరగట్లపాలెంలో డిజిటల్ భారత్‌పై ప్రచారం చేశారు. ఎస్‌బీఐ కొమరగిరిపట్నం బ్రాంచి నిర్వహణాధికారి ఎస్.గంగాధర్ డిజిటల్ చెల్లింపులు, ఫోన్‌పే, గూగుల్‌పేలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్‌పీ చంద్రమౌళి, టీవీ జనార్దనరావు, ఎన్ఎస్ఎస్ అధికారి సలాది తాతయ్యనాయుడు, సీహెచ్ శివన్నారాయణ, డాక్టర్ ఎస్.శ్రీకాంత్, బీఎస్ఎన్ మూర్తి, ఆకుల ప్రవీణ్, వి.శ్రీనివాస్, ఎ.దుర్గామాధురి పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరం

ద్రాక్షారామ, మార్చి 20: ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని బుధవారం అన్నాయిపేట, వెలంపాలెం ప్రాథమిక పాఠశాలల్లో ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. ద్రాక్షారామ భీమేశ్వర దంత వైద్యశాల వైద్యుడు డా.క్రాంతికుమార్ విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా టూత్ పేస్టులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు ముత్తయ్య, జానకిరత్నం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కావిళ్ల ఉత్సవం

మండపేట, మార్చి 20: ద్వారపూడిలో బుధవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి కావిళ్ల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి మాలధారణ చేసిన స్వాములు కాల్వలో స్నానాలు ఆచరించి కన్యలు కళశాలతో ఊరేగింపు నిర్వహించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో స్వాములు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

సారా స్వాధీనం

కపిలేశ్వరపురం, మార్చి 20: కేదార్లంక, వీధివారిలంక పొలాల్లో మంగళవారం నిర్వహించిన దాడుల్లో 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు అంగర ఎస్ఐ ఎ.పరదేశి తెలిపారు. కరుపోతు ప్రసన్నకుమార్, పొద్దాక వెంకట్‌వర్మలను అదుపులోకి తీసుకుని ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించామన్నారు. ఘటనా స్థలంలో డ్రమ్ములు, కట్టెల పొయ్యిలను ధ్వంసం చేసామని, 3 గిన్నెలు, పాలిథిన్ కవర్లు, 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రక్తదాన శిబిరం

అమలాపురం టౌన్, మార్చి 20: లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొలిశెట్టి తాతాజీ ఆధ్వర్యంలో బుధవారం బుద్దాల నాగరత్నం మెమోరియల్ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించారు. 42మంది రక్తదానం చేశారు. కొలిశెట్టి వీరలక్ష్మీదుర్గ, సభ్యులు చీకట్ల కిరణ్, ఆకుల ఆర్కే నాయుడు, వానపల్లి కేశవ, హనుమాన్ బుజ్జి, కుంపట్ల వరలక్ష్మి, డాక్టర్ కారెం రవితేజ, అడ్డాల గోపాలకృష్ణ, డాక్టర్ పీవీఎల్ రవీంద్ర, డాక్టర్ పి.శివఆశిష్, లింగోలు పండు, డాక్టర్ కొప్పుల నాగమానస పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రాయవరం, మార్చి 20: పసలపూడి బస్టాండ్ ఎదురుగా ఉన్న సాయిబాబా ఆలయం వద్ద వేమనరెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కొవ్వూరి శ్రీనివాస రెడ్డి, పోతంశెట్టి సత్తిబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తోటకు ఓటమి భయం: వేగుళ్ల

మండపేట, మార్చి 20: రామచంద్రపురం నియోజకర్గ ప్రజలు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును తిరస్కరిస్తే మండపేట వచ్చిపడ్డారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఇక్కడైనా పనితీరు మార్చుకోవాలని సూచించారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరు లతో మాట్లాడారు. ఎమ్మెల్సీ తోటకు మండపేటలో ఓటమి భయం పట్టుకుందని వేగుళ్ల ఎద్దేవా చేశారు. గాడిలంకలో ఉన్న బంధువుల ఓట్లను తోట రాయవరం మండలం సోమే శ్వరంలో చేర్పించారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం రావటం ఖాయమ న్నారు టీడీపీ కార్యకర్తలు జోలికి వస్తే తాటా తీస్తానని ఆయన హెచ్చరించారు. సమా వేశంలో టీడీపీ నాయకులు వాదా ప్రసాదరావు, సాదనాల చక్రపాణి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, జనసేన అధికార ప్రతినిధి శెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.

వరప్రసాద్‌ను గెలిపించాలి

అంతర్వేది, మార్చి 20: ఉమ్మడి అభ్యర్థి విశ్రాంత ఐఏఎస్ అధికారి దేవ వరప్రసాద్‌ను బంపర్ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ నియోజకవర్గ ఎస్సీసెల్ అధికార ప్రతినిధి తాడి మోహన్‌బాబు అన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ వ్యాప్తంగా దేవ వరప్రసాద్‌తో కలిసి తిరిగి రాజోలు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు మరోసారి నియోజకవర్గ గెలుపును అత్యధిక మెజార్టీతో చూపించాలన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో దేవ వరప్రసాద్ అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయితీపై పశుభీమా

ఆలమూరు, మార్చి 20: పశువులకు రాయితీపై భీమా అందిస్తున్నామని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు కర్నీడి మూర్తి తెలిపారు. బుధవారం పినపళ్ల పశువైద్యశాలకు విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈపథకంలో రైతులు రూ.396 చెల్లిస్తే పశుసంవర్ధక శాఖ రూ.1,536 చెల్లిస్తుందని, పశువుకు రూ.30వేలు భీమా వర్తిస్తుందన్నారు. జిల్లాకు 50వేల యానిమల్ హెల్త్ కార్డులు మంజూర య్యా యని, రైతులకు 90శాతం పంపిణీ చేశామన్నారు. పశువులకు గాలికుంటువ్యాధి టీకాలు 90శాతం అం దించామని, మిగిలిన రైతులు పశువుల ఆసుపత్రులకు వెళ్లి వేయించాలని సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ బాగుందని పశువైద్యాధికారి ఈదల శ్రీనివాస్ చౌదరిని మూర్తి అభినందించారు. గుమ్మిలేరు పశువైద్యాధికారి సుభాష్ పాల్గొన్నారు.

పుదుచ్చేరి లోక్‌సభకు నోటిఫికేషన్ విడుదల

యానాం, మార్చి 20: పుదుచ్చేరి ఏకైకా లోక్‌సభ స్థానానికి పుదుచ్చేరి ఎన్నికల శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. తొలి విడతలో ఏప్రిల్ 19న పుదుచ్చేరి లోక్‌సభకు ఎన్నికలు జరగనున్నాయి. తొలిరోజు ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు. నామినేషన్ల స్వీకరణకు 27వరకు గడువు, 28న నామినేషన్ల పరిశీలన, 30న నామినేషన్ల ఉపసంహరణకు గడువుగా నిర్ధారించారు. ఏప్రిల్ 19న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కిస్తారు. పుదుచ్చేరి లోక్‌సభ పరిధిలో పుదుచ్చేరి ప్రాంతంలో 23 అసెంబ్లీలు, కారైకాల్ ప్రాంతంలో ఐదు అసెంబ్లీలు, మహే ఒక అసెంబ్లీ, యానాం ఒక అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరుగుతాయి.

146 లోకేషన్లకు వాహనాల ఏర్పాటు

పి.గన్నవరం, మార్చి 20: నియోజకవర్గంలో 212పోలింగ్ బూత్‌లకు 146లోకేషన్లలో ఎన్నికల నిర్వహణ సిబ్బందిని, సామగ్రి తరలింపునకు 28 పెద్దబస్సులు, 40 చిన్నబస్సులు, 44టాటా మేజిక్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎస్‌కే హుస్సేన్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి సెక్టారోల్ అధికారులకు, తహసీల్దార్లకు, ఎస్ఐలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూట్‌మ్యాప్‌పై అధికారులతో చర్చించారు. సమావేశంలో తహసీల్దార్లు జె.విమలకుమారి, ఎం.మేరికమ్మ, డీఎల్ ప్రేమ ద్వార్, ఎస్ఐలు బి.శివకృష్ణ, బి.రాజేష్ కుమార్, పీవీఎస్ఎస్ సురేష్, ఎంపీడీవోలు సీహెచ్ త్రిశూలపాణి, మురళీ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

మామిడికుదురు, మార్చి 20: ప్రజలు ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని నగరం ఎస్ఐ పి.సురేష్ సూచించారు. అప్పనపల్లి, పెదపట్నంలంకలో ఎన్నికలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పెదపట్నంలంకలో సీఐఎస్ఎఫ్ బృందాలతో కవాతు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆర్థిక సహాయం

కాట్రేనికోన, మార్చి 20: వెంకమ్మచెరువులో మధుర పళ్ళాలమ్మకు చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కాలి బూడిదయ్యింది. బుధవారం సర్పంచ్ గంటి వెంకటసుధాకర్, వైసీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు సంసాని నాగేశ్వరరావు బాధితులను పరామర్శించి రూ.5,000 అందించారు.

రిఫరీగా డిగ్రీ కళాశాల రికార్డు అసిస్టెంట్

మండపేట, మార్చి 20: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రికార్డు అసిస్టెంట్ వి.వెంకట్రావు ఇటీవల బిహార్ రాష్ట్రం పాట్నాలో నిర్వహించిన 68వ జాతీయ బాల్‌బ్యాడ్మింటన్ బాలురు, బాలికల పోటీల్లో రిఫరీగా వ్యవహరించారు. బుధవారం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సహచర ఉద్యోగులు వెంకట్రావును అభినందించారు.

భారీ వర్షం



అయినవిల్లిలో వర్షం కురుస్తున్న దృశ్యం

అయినవిల్లి, మార్చి 20: ద్రోణి ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. అయినవిల్లి, కొండుకుదురు, అయినవిల్లిలంక తదితర గ్రామాల్లో మధ్యాహ్నం నుంచి వర్షం కురిసింది.

కె.గంగవరం: మండలంలో బుధవారం మధ్యాహ్నంభారీవర్షం కురిసింది. అకాల వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని పొలాలు ఈనిక సమయంలో ఉన్నందున ఊసవస్తుందని, పురుగులు పెరుగుతాయన్నారు.

రావులపాలెం: వాతావరణమార్పులతో మండలంలో బుధవారం రెండు గంటల పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ముంపులో చిక్కుకుంది. పలుప్రాంతాలు బురదమయమయ్యాయి.

ఎంపీ అనురాధను కలిసిన రాపాక

అల్లవరం, మార్చి20: అమలాపురంలోక్‌సభ వైసీపీ అభ్యర్థి, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు బుధవారం మొగళ్లమూరులో ఎంపీ చింతా అనురాధను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్.అంబికా శ్రీను, వైసీపీ నాయకులు పాల్గొన్నారు. రాజోలు అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు గోడిలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. చాట్ల సత్యనారాయణ, ఎన్.హనుమంతరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	మాయ
వెంకటరమణ	వెయ్ దరువెయ్
శ్రీలలిత	గామి
శేఖర్ స్క్రీన్-1	తంత్ర
శేఖర్ స్క్రీన్-2	హనుమాన్
రమా	ప్రేమలు
గణపతి	గుంటూరు కారం
వెంకటపద్మావతిస్క్రీన్-1	భీమా
వెంకటపద్మావతి స్క్రీన్-2	భీమ

టీడీపీలో చేరికలు



ఐ.పోలవరం, మార్చి 20: కాట్రేనికోన మండలం గెద్దనపల్లికి చెందిన వైసీపీ కార్యకర్తలు బుధవారం మురమళ్ళ టీడీపీ క్యాంపు కార్యాలయంలో కూటమి ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గెద్దనపల్లి మాజీ సర్పంచ్ గిడ్డి నాగరాజు ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వారిలో పెయ్యల చిట్టిబాబు, దడాల బాలకృష్ణ, పెయ్యల సునీల్, పెయ్యల శేఖర్, పెయ్యల త్రిమూర్తులు, జి.సందీప్ ఉన్నారు.

ఘనంగా సోమేశ్వర, గోపాలస్వామివార్ల కల్యాణం

ద్రాక్షారామ, మార్చి 20: వెల్లలో వేంచేసియున్న బాలాత్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత గోపాలస్వామివార్ల కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. ముందుగా అంకురారోపణం, ధ్వజారోహణం, నిత్యోపాసన, బలిహరణ అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి కల్యాణం జరిగింది. గణపతిపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీత ధారణ అనంతరం రాత్రి9.37గంటలకు సుమూహుర్తం నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ మాంగల్యధారణ జరిగింది. అర్చకులు చావలి సోమేశ్వరరావు, అంగర విజయవెంకట సూర్యనారాయణాచార్యులు, గ్రామస్థులు, ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

పి.గన్నవరం, మార్చి20: మొండెపులంక శివారు బొంతువారిపేటలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు నూతనంగా ఏర్పాటుచేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం ప్రారంభించారు. మాలల జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్ కోట రామ్మోహనరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో చిల్లే మోహనరావు, మానుకొండ నాగేంద్ర, మానుకొండ సుబ్బారావు, గుర్రం జయకుమార్, తోలేటి నరసింహరావు, కొల్లాటి వెంకట్రావు, ఇంజే వెంకట్రావు, మానుకొండ జయనంద తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి జాతర

అమలాపురం రూరల్, మార్చి 20: నడిపూడిలో శ్రీసత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు పాలగుమ్మి, జనుపల్లి, నల్లచెరువు, నల్లమిల్లి తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రంకిరెడ్డి కుటుంబీకుల పంట పొలాల్లో తాడి చెట్టు వద్ద నుంచి అమ్మవారిని తీసుకువచ్చి గ్రామంలో జాగరం మహోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లుబోయిన నాని, ఉపసర్పంచ్ రంకిరెడ్డి సాంబమూర్తి, రంకిరెడ్డి శ్రీనివాసరావు, రంకిరెడ్డి రామలింగేశ్వరరావు, అరిగెల శ్రీరామారావు, అరిగెల సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

సుదర్శన హోమానికి రూ.లక్ష విరాళం

అంతర్వేది, మార్చి 20: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనం అనంతరం కడలి గ్రామానికి చెందిన యిలపకుర్తి సుబ్రహ్మణ్యం-శశికళ దంపతులు బుధవారం నారసింహస్వామి నిత్య సుదర్శన హోమానికి రూ.లక్ష విరాళాన్ని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించారు. దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

రంగు మార్చారు..

ఉప్పలగుప్తం, మార్చి20: భీమనపల్లి సొసైటీ గొడౌన్ రంగు మార్చారు. 'ఇది కోడ్ ఉల్లంఘన కాదా' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలోప్రచురితమైన వార్తకు ఉన్నతాధికారులు స్పందించారు. మండల స్థాయిలో చర్యలు తీసుకున్నారు. ఎంపీడీవో కె.వెంకటేశ్వరప్రసాద్ ఆదేశాలతో గొడౌన్‌కు తెలుపు రంగు వేశారు.

ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలి

అల్లవరం, మార్చి 20: ఇంటి పన్నులను ఈనెలాఖారుకు నూరు శాతం వసూలు చేయాలని డీఎల్పీవో బొజ్జిరాజు, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ ఆదేశించారు. బుధవారం వారు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కార్యదర్శులు శ్రద్ధ చూపాలన్నారు. ఈవోపీఆర్డీ ఎన్వీవీ సత్యనారాయణ, ఎస్.రాజమోహన్, పి.శ్రీనివాస్, అడబాల రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు

అంబాజీపేట: పంచాయతీల్లో మార్చి నెలాఖరుకు నూరుశాతం ఇంటి పన్ను వసూళ్లుచేయాలని డీఎల్‌పీవో పి.బొజ్జిరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ఈవోపీఆర్డీ బి.మమత, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయమే గానీ..

అమలాపురం టౌన్, మార్చి 20: అది అమలాపురం తహసీల్దారు కార్యాలయమే. బుధవారం సినిమా షూటింగ్ కోసం సహాయ వ్యవసాయ సంచాలకుని కార్యాలయంగా మారిపోయింది. ఉదయం నుంచి సినిమా షూటింగ్ నిర్వహించడంతో తహసీల్దారు కార్యాలయానికి వివిధ పనులపై దూర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఘనంగా గణపతి విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట, మార్చి20: మాచవరం పోతాయిలంకలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో గణపతిస్వామివారి ప్రతిష్ఠను బుధవారం ఘనంగా నిర్వహించారు. మట్టపర్తి వెంకటేశ్వరరావు-కనకదుర్గ దంపతులు, ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వేదపండితులు కారుపర్తి తేజాశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

వైభవంగా సీతారామస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కె.గంగవరం, మార్చి20: దంగేరులో చెరువుగట్టుపేటలో సీతారాముల వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. టీడీపీ, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు వాసంశెట్టి సుభాష్, పిల్లి సూర్యప్రకాష్, ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, దంగేరు ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, కాదా నాగేశ్వరరావు, కుందూరు సర్పంచ్ పంపన సత్యానందం, వాసంశెట్టి శ్యామ్, ఆలయ కమిటీ సభ్యులు పతితాని శ్రీనివాస్, పలివెల రామకృష్ణ, వాసంశెట్టి ఆంజనేయులు, అనసూరి గోవిందు, వాసంశెట్టి దుర్గారావు పాల్గొన్నారు.

స్వామివార్ల కల్యాణం

ఆత్రేయపురం, మార్చి 20: పులిదిండి మీసాల వేణుగోపాలస్వామి, ఆత్రేయపురం వేణుగోపాలస్వామి కల్యాణాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆకట్టుకున్న లక్ష పసుపు కొమ్ముల నోము

ఆలమూరు, మార్చి 20: పెదపళ్లలో కంచర్ల గంగారావు-మంగాదేవి దంపతులు బుధవారం లక్ష పసుపు కొమ్ముల నోము చేసుకున్నారు. మహిళలకు పసుపు కొమ్ములు అందజేశారు. సాయంత్రం జరిగిన లక్ష ఒత్తుల నోమును అధిక సంఖ్యలో మహిళలు తిలకించారు.

భద్రతా వైఫల్యంపై విచారణ జరిపించాలి

అయినవిల్లి, మార్చి 20: చిలకలూరిపేటలో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొన్న బహిరంగ సభలో భద్రతా వైఫల్యంపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ హెచ్‌ఆర్డీ సభ్యుడు నేదునూరి వీర్రాజు డిమాండు చేశారు. ప్రధాని మోదీకి సరైన భద్రతా ఏర్పాట్లు చేయలేదని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి, నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. లక్షలాది మంది టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు హాజరైన సభకు పూర్తిస్థాయి భద్రతా సిబ్బందిని నియమించకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటన్నారు.

వీఎస్ఎంలో ప్రాంగణ ఎంపికలు

రామచంద్రపురం(ద్రాక్షారామ),మార్చి20: స్థానిక వీఎస్ఎం కళాశాలలో బుధవారం సన్‌గ్లేర్ టెక్నాలజీస్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 92మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారని వైస్ ఛైర్మన్ ఎం.ఎస్.ఎస్.మూర్తి తెలిపారు. ఇంజనీరింగు నుంచి 77మంది, డిగ్రీ నుంచి 15మంది ఉద్యోగాలు సాధించారు.

బిల్లు చెల్లించిన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

అంబాజీపేట, మార్చి 20: కెపూడపూడిలో చేపట్టిన సీసీ రోడ్ల అభివృద్ధి పనులకు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ధ్రువీకరించకుండా పంచాయతీ కార్యదర్శి విత్తనాల వెంకటరమణ నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించడంపై సర్పంచ్ బీర శాంతి డీపీవోకు ఫిర్యాదు చేశారు. నగదు బదిలీపై విచారణ చేపట్టి కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలన్నారు.

హుండీల్లో పువ్వులు.. పాడైన కరెన్సీ నోట్లు

ఆత్రేయపురం, మార్చి 20: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీల్లో కొంతమంది భక్తులు పువ్వులు, తులసి, పత్రి వేయడంతో భక్తులు సమర్పించిన నగదు,కానుకలు పాడైపోతున్నాయి. నోట్లు తడిసి రంగు మారుతున్నాయి. తరుచూఇదే పరిస్థితి. ఏడు పుష్పాలస్థానే ఏడు రూపాయి కాయిన్లను హుండీల్లో వేసి నోట్లు పాడవ్వకుండా చూడాలని కోరుతున్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ హర్షం

ఐ.పోలవరం, మార్చి 20: బాపట్ల ఎంపీ సీటుకు ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు ఎంపికపై అంబేడ్కర్ కోనసీమ జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు(బాలు), నియోజకవర్గ అధ్యక్షుడు చెయ్యేటి శ్రీనుబాబు హర్షం వ్యక్తంచేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జాతీయ కార్యదర్శి లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా బండారు శ్రీనివాస్ పుట్టినరోజు

రావులపాలెం, మార్చి 20: కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ పుట్టినరోజు బుధవారం ఘనంగా జరిగింది. రావులపాలెంలోని శుభోదయ అంధుల పాఠశాల, బ్రైట్‌లైట్ దివ్యాంగుల ఆశ్రమాల్లో విద్యార్థులతో కేక్ కట్ చేయించి పండ్లు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. జనసేన మండల శాఖ అధ్యక్షుడు తోట స్వామి, నాయకులు యర్రంశెట్టి రాము, అంబటి కిషోర్, నంబు రవి, జనసైనికులు పాల్గొన్నారు.

వైద్య సేవలు

ముమ్మిడివరం, మార్చి 20: ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ వైద్యురాలు యోగితాలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఆరోగ్య సురక్షా ఫేజ్-2 కార్యక్రమంలో భాగంగా సూరాయిచెరువు సచివాలయం పరిధిలోని 8,9 వార్డుల్లో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు కేజియా, టి.నాగేశ్వరరావు, సీహెచ్‌వీ సంపూర్ణ, ఎన్వీవీ సత్యనారాయణ, బి.బాలాజీ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగురాలిపై దాడి అమానుషం

రాయవరం, మార్చి 20: లొల్ల గ్రామానికి చెందిన దివ్యాంగురాలు మేడిశెట్టి ధనమ్మ, ఆమె తల్లిదండ్రులపై దాడికి పాల్పడిన భర్త చంద్రశేఖర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని దివ్యాంగ హక్కుల కమిటీ సభ్యుడు ఖండవిల్లి భరత్‌కుమార్ డిమాండ్‌చేశారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ధనమ్మను సీఐటీయూ నాయకురాలు డి.ఆదిలక్ష్మి పరామర్శించారు.

వాహనాల తనిఖీ

రాయవరం, మార్చి 20: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాయవరం-సోమేశ్వరం ప్రధాన రహదారిలో ప్రయాణిస్తున్న వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని నోడల్ అధికారి కె.వెంకటలక్ష్మి హెచ్చరించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.